మోగిన రాజ్యసభ ఎన్నికల నగారా

- *15 రాష్ట్రాల్లో 56 స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు*
- *తెలంగాణలో మూడు ఖాళీలు*

న్యూఢిల్లీ/ హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ ఎన్నికల నగారా మోగింది. వచ్చే నెల 27న దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 56 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఈసీ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, 27న పోలింగ్ నిర్వహణ, అదే రోజున సాయంత్రం ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నది. ప్రస్తుతం రాజ్యసభలోని 56 మంది ఎంపీల పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనున్నది.

రాష్ట్రం నుంచి మూడు ఖాళీలు..

తెలంగాణ నుంచి ముగ్గురు సభ్యులు రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్నారు. వీరిలో భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. వీరి స్థానంలో ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తికరంగా ఉన్నది. రాజ్యసభ ఎన్నికలకు ఎమ్మెల్యేలు ఓట్లు వేయాల్సి ఉంటుంది. తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64 స్థానాలు సాధించిన నేపథ్యంలో ఆ పార్టీకి కనీసం రెండు స్థానాలు వచ్చే అవకాశం ఉన్నది. సంఖ్యా బలం రీత్యా బీఆర్ఎస్ ఒక స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునే అవకాశం ఉన్నది.

అభ్యర్థుల నిర్ణయం తొలివారంలోనే...

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజ్యసభ అభ్యర్థులను ఇంకా నిర్ణయించలేదు. షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో మరో వారంలో ఇరుపార్టీలు అభ్యర్థులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. కాంగ్రెస్‌లో తెలంగాణ నుంచి జానారెడ్డి, వీ హన్మంతరావు, చిన్నారెడ్డి వంటి నేతలతోపాటు పలువురు ముఖ్యులు రాజ్యసభ స్థానం ఆశిస్తున్నారు.

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్	ఫిబ్రవరి 8
నామినేషన్లకు ఆఖరు తేదీ	ఫిబ్రవరి 15
నామినేషన్ల పరిశీలన	ఫిబ్రవరి 16
ఉపసంహరణకు ఆఖరు తేదీ	ఫిబ్రవరి 20
ఎన్నికలు, ఓట్ల లెక్కింపు	ఫిబ్రవరి 27

ఖాళీ కానున్న 56 రాజ్యసభ స్థానాలు

ఉత్తరప్రదేశ్ -10
మహారాష్ట్ర-6, బీహార్ -6
మధ్యప్రదేశ్-5, పశ్చిమబెంగాల్-5
గుజరాత్-4 , కర్ణాటక-4
తెలంగాణ-3, ఏపీ-3, ఒడిశా-3, రాజస్థాన్-3
ఛత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్, ఉత్తరాఖండ్-1 చొప్పున

నేడు అఖిలపక్ష భేటీ

రేపటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జనవరి 29: ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు అన్ని పార్టీలకు ఇప్పటికే సమాచారం ఇచ్చింది. సమావేశాల ప్రారంభానికి ముందు అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేసి అభిప్రాయాలు కోరడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే మోదీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ కానుండటం, త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనుండటంతో ఈ సారి సమావేశాలు చాలా వాడీవేడీగా జరుగనున్నాయి.

వారంలో సీఏఏ అమలు

దేశవ్యాప్తంగా అమలు చేస్తాం ● ఇది నా కచ్చితమైన గ్యారెంటీ
కేంద్రమంత్రి శాంతనూ ప్రకటన ● ఎన్నికల జిమ్మిక్కేనన్న టీఎంసీ
లోక్‌సభ ఎన్నికల ముంగిట మళ్లీ తెరపైకి పౌరసత్వ సవరణ చట్టం

కోల్‌కతా, జనవరి 29: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న వేళ పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వారం రోజుల్లో సీఏఏను దేశవ్యాప్తంగా కచ్చితంగా అమలు చేస్తామని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రి శాంతనూ ఠాకూర్ సంచలన ప్రకటన చేశారు. పశ్చిమబెంగాల్‌లోని బంగాన్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీగా ఉన్న శాంతనూ.. ఆదివారం సాయంత్రం దక్షిణ 24 పరగణాల జిల్లాలోని కాక్‌ద్వీప్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 'అయోధ్యలో రామమందిరం ప్రారంభం అయింది. అలాగే వారం రోజుల్లో పశ్చిమబెంగాల్‌తో సహా దేశ వ్యాప్తంగా సీఏఏను అమలు చేస్తాం' అని ఆయన వ్యాఖ్యానించారు. సీఏఏను వ్యతిరేకిస్తున్న రాష్ట్రంలోని అధికార టీఎంసీని లక్ష్యంగా చేసుకొని ఈ సందర్భంగా ఆయన విమర్శలు చేశారు. ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నవారు ఈ దేశ పౌరులని, ఓట్లు వేయొచ్చని టీఎంసీ ప్రభుత్వం చెబుతున్నదని, అయితే ఇక్కడ ఉన్న వేలాది మంది పౌరులకు ఓటు హక్కు ఇచ్చేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. దీనికి సీఎం మమతా బెనర్జీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు తరాలను కాపాడేందుకు సీఏఏను అమలు చేయాల్సిన అవశ్యకత ఉన్నదని నొక్కిచెప్పారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆదివారం సభలో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్నారు. 'సీఏఏ వారం రోజుల్లో కచ్చితంగా అమలవుతుంది. ఇది నా గ్యారెంటీ' అని పునరుద్ఘాటించారు. బంగాన్ లోక్‌సభ నియోజకవర్గంలో మథువా కమ్యూనిటీ ప్రజలు అధికంగా ఉంటారు. ఆ కమ్యూనిటీలో శాంతనూ ఠాకూర్ ప్రముఖ నేతగా ఉన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శాంతనూ ఠాకూర్

ఎన్నికలకు ముందే రూల్స్ నోటిఫై!

కేంద్రంలోని బీజేపీ సర్కార్ సీఏఏ చట్టం నిబంధనలను లోక్‌సభ ఎన్నికలకు ముందే నోటిఫై చేసే అవకాశం ఉన్నదని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి శాంతనూ తాజా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత డిసెంబర్‌లో కోల్‌కతాలో నిర్వహించిన బీజేపీ సమావేశంలో మాట్లాడుతూ సీఏఏ అమలు అనివార్యమని అన్నారు. సీఏఏ అంశంపై మమత ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే..

కేంద్ర మంత్రి శాంతనూ వ్యాఖ్యలను టీఎంసీ కొట్టిపారేసింది. ఆయన ప్రకటన కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని పేర్కొన్నది. రాష్ట్రంలో సీఏఏ అమలును అడ్డుకొని తీరుతామని స్పష్టం చేసింది. కూచ్‌బెహార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ సీఏఏ అంశాన్ని లేవనెత్తుతున్నదని విమర్శించారు. ఎన్నికలకు ముందు మతపరమైన సెంటిమెంట్లను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అయితే ఠాకూర్ వ్యాఖ్యలపై స్పందించేందుకు పశ్చిమబెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ నిరాకరించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వమే సమాధానం చెప్పగలదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలోగానే సీఏఏ నిబంధనలు రూపొందిస్తారనే విశ్వాసం తనకు ఉందన్నారు.

CAA

ఏమిటీ సీఏఏ?

కేంద్ర ప్రభుత్వం 2019, డిసెంబర్‌లో పౌరసత్వ సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకొన్నది. మతపరమైన హింస కారణంగా 2014, డిసెంబర్ 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్గానిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్ మతస్తులకు పౌరసత్వం ఇచ్చేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే 1955 పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంలో ముస్లింలను మినహాయించడం వివాదానికి దారితీసింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. అయితే సీఏఏకు సంబంధించిన నిబంధనలు ఇప్పటి వరకు ఖరారు కాలేదు. రూల్స్ రూపకల్పన విషయంలో 2020 నుంచి కేంద్ర హోంశాఖ వాయిదాలు వేసుకొంటూ వస్తున్నది.

సాయం మరిచి.. సుత్తితో కొట్టి!

అమెరికాలో భారత విద్యార్థి దారుణ హత్య

న్యూయార్క్: అమెరికాలో వివేక్ సైనీ (25) అనే భారత విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. జార్జియా రాష్ట్రంలోని లిథోనియాలో డ్రగ్స్‌కు అలవాటు పడిన జూలియన్ ఫాల్కనర్ అనే ఓ నిరాశ్రయుడు సుత్తితో సైనీ తలపై దాదాపు 50 సార్లు కొట్టి కిరాతకంగా హత్య చేశాడు. ఈ నెల 16న జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. బీటెక్ పూర్తిచేసిన సైనీ రెండేండ్ల క్రితమే హర్యానా నుంచి అమెరికాకు వెళ్లాడు. ఇటీవలే అక్కడ ఎంబీఏ పట్టా పొంది జార్జియాలోని ఓ స్టోర్‌లో పార్ట్‌టైమ్ క్లర్క్‌గా చేరిన సైనీకి అక్కడ ఫాల్కనర్ కనిపించడంతో జాలిపడి చేరదీసి రెండ్రోజుల పాటు సాయం చేశాడు. అతనికి చిప్స్, కోక్, నీళ్లు అందజేయడంతోపాటు వెచ్చదనం కోసం తన జాకెట్‌ను ఇచ్చేశాడు. ఈ క్రమంలో ఫాల్కనర్ ఎప్పటి మాదిరిగానే ఈ నెల 16న ఆ స్టోర్ వద్దకు వచ్చాడు. అయితే అప్పటికే స్టోర్‌ను మూసివేసి ఇంటికి బయలుదేరిన సైనీ.. అక్కడి నుంచి వెళ్లిపోవాలని లేదంటే పోలీసులను రప్పిస్తానని ఫాల్కనర్‌కు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన అతడు సుత్తితో విచక్షణా రహితంగా సైనీ తలపై కొట్టాడు. ఈ సమాచారం తెలిసి పోలీసులు అక్కడికి వచ్చేసరికే సైనీ ప్రాణాలు కోల్పోయాడు.

అమ్మా.. నాన్నా.. జేఈఈ నా వల్ల కాదు

- *నేను ఓడిపోయాను.. క్షమించండి*
- *నేను ఆత్మహత్య చేసుకుంటున్నా*
- *నాకున్న చివరి ఆప్షన్ ఇదే*
- *రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థిని బలవన్మరణం*



కోటా(రాజస్థాన్), జనవరి 29: రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలకు తెరపడడం లేదు. జేఈఈకి శిక్షణ పొందుతున్న ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలతో అర్ధంతరంగా ప్రాణాలను వదిలేస్తున్నారు. తాజాగా, మరో విద్యార్థి నిహారికా సింగ్ (18) తన ఇంట్లోనే సోమవారం ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. అంతకుముందు తన తల్లిదండ్రులను ఉద్దేశించి సూసైడ్ నోట్ రాస్తూ 'అమ్మా, నాన్నా జేఈఈ నా వల్ల కాదు. నేను ఓడిపోయాను. నేనో చెత్త కుమార్తెను. అమ్మా నాన్న నన్ను క్షమించండి. నాకున్న చివరి ఆప్షన్ ఇదే. నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అని రాసుకొచ్చింది. ఆమె ఆత్మహత్యకు ఒత్తిడే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రధాని మోదీ సంభాషించిన రోజే నిహారిక ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. కోటాలో నిరుడు 26 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, ఈ ఏడాది ఇది రెండోది.

జేఈఈ జటిలం.. గణితం కఠినం

మొదటిపేజీ తరువాయి...

రాయడంలో విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగానే ఇచ్చినా, అధికంగా ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచే ఇవ్వడం గమనార్హం. మొదటి షిఫ్ట్‌కు హాజరైన వారు 300 మార్కులు సాధించడం కష్టమని, ప్రతిభావంతులు 290 -280 మార్కులలోపే సాధించే అవకాశాలున్నట్టు శ్రీచైతన్య ఐఐటీ ఆలిండియా కో ఆర్డినేటర్ ఉమాశంకర్ అంచనా వేశారు. ఇక మధ్యాహ్నం నిర్వహించిన షిఫ్ట్-2 పరీక్ష పేపర్ సులభంగా ఉన్నట్టు తెలిపారు. ఈ పేపర్‌లో గణితం ప్రశ్నలు పొడవుగా ఉన్నా విద్యార్థులు తేలిగ్గానే ఆన్సర్లు చేశారని విశ్లేషించారు. ఫిష్ట్-2కు హాజరైన వారు 300 మార్కులు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

ఎన్టీఏ నిర్వాకం.. అభ్యర్థుల అయోమయం

జేఈఈ మెయిన్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పొరపాట్ల మీద పొరపాట్లు చేస్తున్నది. ఈ సంస్థ నిర్వాకంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. జేఈఈ మెయిన్-1 పరీక్ష పేపర్‌లో తొలగించిన సిలబస్ నుంచి ప్రశ్నలిస్తున్నారు. తొలగించిన సిలబస్ నుంచి సోమవారం కెమిస్ట్రీలో ఒక ప్రశ్న రాగా, 27న ఫిజిక్స్‌లో ఎక్స్‌పరిమెంటల్ ఫిజిక్స్ నుంచి ఒక ప్రశ్న అడిగారు. సోమవారం షిఫ్ట్-1లో జరిగిన ఫిజిక్స్ పేపర్‌లో ఒక ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో సమాధానాలు ఇవ్వనేలేదు. దీంతో అభ్యర్థులు అయోమయంలో పడ్డారు.

జార్ఖండ్ సీఎం సారేన్ కారు సీజ్

మనీలాండరింగ్ కేసులో ఈడీ చర్యలు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌కు చెందిన బీఎండబ్ల్యూ కారుతోపాటు కొన్ని పత్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం జప్తు చేశారు. ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులకు ఆయన ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించారు. సోరేన్‌కు ఇప్పటికే ఈడీ ఏడుసార్లు సమన్లు జారీచేయగా.. ఆయన హాజరుకాలేదు. ఆయన ఈడీ సమన్లను సుప్రీంకోర్టులో మంగళవారం సవాల్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం ఈడీ అధికారులకు పంపిన ఈ-మెయిల్‌లో, జనవరి 31న మధ్యాహ్నం 1 గంటకు సోరేన్‌ను రాంచీలోని ఆయన నివాసంలో ప్రశ్నించవచ్చునని తెలిపారు. ప్రభుత్వ భూముల యాజమాన్యం మార్పు కుంభకోణంలో రూ.600 కోట్లు చేతులు మారినట్లు ఈడీ ఆరోపిస్తున్నది. ఇదిలావుండగా, సోరేన్ కోసం ఈడీ అధికారులు సోమవారం జార్ఖండ్ భవన్‌కు, మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని సోరేన్ తండ్రి నివాసానికి వెళ్లారు. కానీ ఆయన ఈ రెండు చోట్ల లేరు. ఆయన చార్టర్డ్ విమానం ఢిల్లీ విమానాశ్రయంలో పార్క్ చేసి ఉంది. కొందరు ఈడీ అధికారులు సోమవారం రాత్రి వరకు ఆయన నివాసం వెలుపల తిష్ఠ వేశారు.

పిల్లల రిపోర్టు కార్డు.. మీ విజిటింగ్ కార్డు కాదు: మోదీ

న్యూఢిల్లీ: పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టు కార్డును తల్లిదండ్రులు వారి విజిటింగ్ కార్డుగా భావించడం, ఎవరినైనా కలిసినప్పుడు గొప్పలు చెప్పుకోవడం సరికాదని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. పరీక్ష సమయంలో విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిలో మనోధైర్యాన్ని నింపడం చాలా అవసరమన్నారు. 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో ప్రధాని మోదీ సోమవారం పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. విద్యార్థులు ఇతరులతో కాకుండా తమతో తామే పోటీపడాలని సూచించారు.

మోదీ మళ్లీ గెలిస్తే ఎన్నికలు ఉండవు: ఖర్గే

భువనేశ్వర్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం వచ్చే చిట్టచివరి అవకాశమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఈ ఎన్నికల్లో మళ్లీ నరేంద్ర మోదీ గెలిస్తే దేశంలో నియంతృత్వం రాజ్యమేలుతుందని హెచ్చరించారు. రష్యాను పుతిన్ పరిపాలిస్తున్నట్లుగా, భారత్‌ను బీజేపీ పాలిస్తుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సోమవారం ఆయన ఈ ఆందోళన వ్యక్తం చేశారు.

మూడో ప్రపంచ యుద్ధం అంచున ఉన్నాం

బైడెన్ బలహీనతే కారణం: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 29: అమెరికా అధ్యక్షుడు బైడెన్ బలహీనత, సొంత విదేశాంగ విధానం లేకపోవటం వల్లే ప్రపంచం.. మూడో ప్రపంచ యుద్ధం అంచునకు చేరిందని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఒకవేళ అమెరికా అధ్యక్షుడిగా తాను ఉండి ఉంటే.. జోర్డాన్‌లో అమెరికా సైనికుల మృతి, ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో హింస ఉండేవి కావన్నారు. ఇటీవల సిరియా సరిహద్దులో జోర్డాన్ వద్ద జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు అమెరికన్ సైనికులు చనిపోగా, దీనికి కారణం బైడెన్ బలహీనత, విదేశాంగ విధానమేనని ట్రంప్ విమర్శించారు. డ్రోన్ ఘటన నేపథ్యంలో సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో బైడెన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు.

యూకే, ఇటలీలో టాటా, మిట్టల్ స్టీల్ ప్లాంట్లు మూత!

- **ప్రమాదంలో వేలాది మంది ఉద్యోగుల భవితవ్యం**
- **పర్యావరణ సమస్యలే ప్లాంట్ల షట్‌డౌన్‌కు కారణం**

న్యూఢిల్లీ, జనవరి 29: భారత్‌లో ప్రముఖ ఉక్కు తయారీ కంపెనీలుగా ఉన్న టాటా స్టీల్‌కు చెందిన యూకే ప్లాంట్, లక్ష్మీ మిట్టల్ యాజమాన్యంలోని ఆర్సెలార్ మిట్టల్‌కు చెందిన ఇటలీ ప్లాంట్ మూసివేత అంచున ఉన్నాయి. ఆయా కంపెనీల కార్యకలాపాలకు వ్యతిరేకంగా లేవనెత్తిన వివిధ పర్యావరణ అంశాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. దీని వలన ఆ రెండు కంపెనీల్లో పనిచేసే వేలాది మంది తమ ఉద్యోగాలు కోల్పోనున్నారు. టాటా స్టీల్ తన వెల్ష్ స్టీల్‌వర్క్స్‌లోని రెండు బొగ్గు ఆధారిత బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసివేసి పర్యావరణహిత(గ్రీనర్), చౌకైన స్టీల్ తయారీ యూనిట్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా.. క్యాన్సర్ కారక రసాయనాలను వెదజల్లుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీని ప్రభుత్వం టేకోవర్ చేయనున్నది. యూకేలో టాటా స్టీల్ మూసివేతతో 2024 చివరి నాటికి 2,800 మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉన్నది.

మిట్టల్ ప్లాంట్ టేకోవర్‌కు సిద్ధంగా ఇటలీ

పర్యావరణ సమస్యల నేపథ్యంలో ఇటలీలోని టారన్టోలో ఉన్న మిట్టల్ కంపెనీకి చెందిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం టేకోవర్ చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్నది. ఈ సంస్థ తన గ్యాస్ సరఫరాదారునికి 200 మిలియన్ డాలర్ల అప్పును కూడా ఎదుర్కొంటున్నది. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌కు సరఫరా నిలిపివేసేందుకు ఇటీవల ఇటలీ కోర్టు సదరు గ్యాస్ కంపెనీకి అనుమతి ఇచ్చింది. ఐరోపాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్లలో ఒకటిగా ఉన్న ఈ కంపెనీలో ఆ దేశ ప్రభుత్వానికి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ ఏజెన్సీ 'ఇన్వితాలియా'కు కూడా వాటా ఉన్నది. ఆర్సెలార్ మిట్టల్‌ను మేనేజ్‌మెంట్ నుంచి తొలగించేందుకు అవసరమైన ప్రక్రియను పర్యవేక్షించేందుకు 'స్పెషల్ అడ్మినిస్ట్రేషన్'ను ప్రవేశపెట్టేందుకు చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించింది. ఈ 'స్పెషల్ అడ్మినిస్ట్రేషన్' అనేది ఇటలీలో దివాలా కంపెనీలకు సంబంధించిన స్కీమ్. మిట్టల్ స్టీల్ కంపెనీ మూసివేత వల్ల దాదాపు 10 వేల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు.

భారతీయులకు 14 లక్షల అమెరికా వీసాలు

రికార్డు స్థాయిలో జారీ

న్యూఢిల్లీ, జనవరి 29: భారతీయులకు గత ఏడాది రికార్డుస్థాయిలో 14 లక్షల వీసాలను జారీచేసినట్టు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ సోమవారం వెల్లడించింది. విజిటర్ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచిచూసే సమయాన్ని 75 శాతానికి తగ్గించగలిగామని తెలిపింది. వరుసగా మూడో ఏడాది ప్రపంచంలోనే అత్యధికంగా 1,40,000కిపైగా స్టూడెంట్ వీసాలను భారతీయ విద్యార్థులకు జారీ చేసినట్టు పేర్కొన్నది. 'స్టూడెంట్ వీసాల ప్రాసెసింగ్‌లో ప్రపంచంలోనే టాప్-4 ప్రదేశాలుగా ముంబై, న్యూఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాలు నిలిచాయి. 2022తో పోలిస్తే 2023లో వీసా దరఖాస్తుల సంఖ్య 60 శాతం పెరిగింది. విజిటర్ వీసా అపాయింట్‌మెంట్ టైమ్ 1000 రోజుల నుంచి 250 రోజులకు తగ్గింది' అని యూఎస్ ఎంబసీ పేర్కొన్నది. వీసా దరఖాస్తుల సంఖ్య అనూహ్యంగా పెరగటంతో, డిమాండ్‌ను అందుకునేలా ముంబయి కాన్సులేట్‌లో తాత్కాలిక, శాశ్వత సిబ్బందిని పెంచామని వెల్లడించింది.

భర్తకు బదులు పిల్లలను నామినేట్ చేయొచ్చు

- **పెన్షన్ నిబంధనలు సడలింపు**
- **మహిళలకు కేంద్రం వెసులుబాటు**

న్యూఢిల్లీ: కుటుంబ పెన్షన్‌కు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగినులు కుటుంబ పింఛను కోసం భర్తను కాకుండా, తమ కుమార్తె లేదా కుమారుడిని నామినేట్ చేసేందుకు వెసులుబాటు కల్పించింది. ఇప్పటి వరకు అమలైన నిబంధనల ప్రకారం, ప్రభుత్వోద్యోగి లేదా పింఛను దారు మరణిస్తే, ఆ వ్యక్తి యొక్క భార్య లేదా భర్తకు కుటుంబ పింఛనును మంజూరు చేసేవారు. ఆ విధంగా పింఛనును పొందిన వ్యక్తి కూడా మరణించిన తర్వాత లేదా అనర్హుడైన అనంతరం మాత్రమే ఇతర కుటుంబ సభ్యులకు దానిని పొందే అర్హత లభించేది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) రూల్స్, 2021కు సవరణలు జరిగాయని చెప్పారు. మహిళా ప్రభుత్వోద్యోగి మరణిస్తే, ఆమె భర్తకు కాకుండా, అర్హత గల ఆమె బిడ్డ లేదా పిల్లలకు కుటుంబ పింఛనును మంజూరు చేయడానికి అనుమతిస్తున్నట్లు తెలిపారు.

ఈ ట్రెండ్.. అత్యంత భయానకం

- **డీప్‌ఫేక్‌పై సత్యనాదెళ్ల ఆందోళన**

వాషింగ్టన్: కృత్రిమ మేధ సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, చిత్రాలపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భయానకమైందిగా పేర్కొన్నారు. అమెరికాలో ప్రముఖులకు చెందిన డీప్‌ఫేక్ ఫొటోలు, చిత్రాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా అమెరికన్ పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్‌కు చెందిన డీప్‌ఫేక్ అశ్లీల దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. 'నెట్టింట ఈ ట్రెండ్ అత్యంత భయానకం. టెక్నాలజీ దుర్వినియోగంపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి' అని ఆయన అన్నారు. సోమవారం ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, 'టెక్నాలజీ దుర్వినియోగం ప్రమాదకరం, భయంకరమైంది. దీనిని అరికట్టేందుకు వేగంగా స్పందించాల్సిన అవసరముంది. ఆన్‌లైన్‌లో సురక్షితమైన సమాచారం ఉండేలా కట్టుదిట్టమైన నిబంధనలు రావాలి. దుర్వ్యాప్తి సంస్థలు, టెక్ సంస్థలు కలిసి వస్తే.. డీప్‌ఫేక్ అరికట్టడం పెద్ద విషయం కాదు' అని సత్యనాదెళ్ల అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ 'డిజైనర్ ఇమేజ్ జెనరేటర్'ను ఉపయోగించి టేలర్ స్విఫ్ట్‌కు చెందిన డీప్‌ఫేక్ అశ్లీల దృశ్యాలు రూపొందాయని ఆ దేశ మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి.

మధుమేహం ఉందంటూ బీమా క్లెయిమ్ తిరస్కరించరాదు

దక్షిణ కన్నడ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్



*బెంగళూరు: డయాబెటిస్ ఉన్నదంటూ బీమా క్లెయిమ్‌ను బీమా కంపెనీ తిరస్కరించరాదని దక్షిణ కన్నడ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు చెప్పింది. క్లెయిముదారు కేఎస్ రాజీవ (70)కి రూ.48,872లను, దీనిపై సంవత్సరానికి 8 శాతం వడ్డీతో సహా చెల్లించాలని బజాజ్ అలయెన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌ను ఆదేశించింది. నష్టపరిహారం కింద రూ.10,000; ప్రొసీడింగ్స్ ఖర్చుల కింద రూ.5,000 చెల్లించాలని స్పష్టంచేసింది. బజాజ్ అలయెన్స్ నుంచి రాజీవ తీసుకున్న మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీ 2022 నవంబరు 9 నుంచి 2023 నవంబరు 18 వరకు చెల్లుబాటవుతుంది. శ్వాస సమస్యలతో ఆయన 2022 సెప్టెంబరు 30 - 2022 అక్టోబరు 2 మధ్య కాలంలో దవాఖానలో చికిత్స పొందారు. దీని కోసం రూ.48,872 ఖర్చు చేశారు. ఈ సొమ్మును భర్తీ చేయాలని బీమా కంపెనీని కోరారు. దీనిపై కంపెనీ స్పందిస్తూ, ఆ